చంద్రబాబు మోసాలను గడప గడపకూ తీసుకెళ్దాం

హామీలపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టడమే కూటమి ఎజెండా

- వైఎస్ జగన్, చంద్రబాబు పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- ఏ కుటుంబం ఎంత మేర నష్టపోయిందో వివరిద్దాం
- పొదిలి, కొనకనమిట్ల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో అన్నా రాంబాబు

కొనకనమిట్ల/పొదిలి రూరల్:

బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా కూటమి మోసపూరిత హామీలు, అరాచక పాలనను ఇంటింటికి వెళ్లి వివరిద్దామని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం పొదిలి పట్టణంలో దర్శి రోడ్డులోని ఫంక్షన్ హాల్లో పొదిలి, కొనకనమిట్ల మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అన్నా రాంబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతో పాటు మరో 143 హామీలు ఇచ్చిందన్నారు. వీటిలో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను వంచించారని విమర్శించారు. చంద్రబాబు ఒక్కరి ష్యూరిటీ అయితే జనం నమ్మరని, పవన్‌కళ్యాణ్‌ను కూడా వెంట తెచ్చుకుని హామీలు గుప్పించారన్నారు. కూటమి గద్దెనెక్కి ఏడాది పూర్తయినా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి ఇంకా వైఎస్సార్ సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టటమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే తొలి ఏడాదిలోనే సుమారు రూ.80 వేల కోట్లు అవసరమని, హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు ఆ మేరకు నష్టపోయారన్నారు. బాబు మోసాలను ప్రజలకు వివరించి ఎవరెవరు ఎంత మేర నష్టపోయారో తెలియజెప్పాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన జగనన్నకు, అబద్ధపు హామీలతో జనాన్ని మోసం చేసిన చంద్రబాబు పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికే మోసపోయామని బాధపడుతున్న ప్రజలకు, ఎంత మేర మోసపోయారో తెలియజెప్పాలన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం, నష్టం వాటిల్లినా వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు.


వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న అన్నా రాంబాబు

పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోవడం ఇది తొలిసారి కాదన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ.. ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.1.80 లక్షల కోట్ల అప్పు చేసిందని విస్మయం వ్యక్తం చేశారు. ముందుగా అన్నా రాంబాబుకు పొదిలి, కొనకనమిట్ల మండలాల నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకుడు కంకణాల రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సమావేశంలో పొదిలి మండలం నుంచి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, జి.శ్రీనివాసులు, నాయకులు గొలమారి చెన్నారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పులిగొర్ల శ్రీనివాసులు, ఆవుల వెంకట సుబ్బారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఫిరోజ్, గౌసియా, రబ్బానీ, బాష, బ్రహ్మారెడ్డి, మస్తాన్‌వలి, కొనకనమిట్ల మండలం నుంచి ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గొంగటి జనీఫా, మండల కన్వీనర్ మోరా శంకరరెడ్డి, ఉడుముల గురవారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు ఏలూరి సంజీవరెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు, మంచికల కోటేశ్వరరావు, నాగం ప్రసాద్, కోండ్రు వెంకటేశ్వర్లు, వేమన వెంకటేశ్వరరెడ్డి, బోయిన వెంకటేశ్వర్లు, గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉన్నం శ్రీనివాసులు, తంగిరాల బ్రహ్మారెడ్డి, కోటపాటి బ్రహ్మారెడ్డి, పార్లపల్లి నబీ, పావులూరి వెంకటేశ్వర్లు, సీసీకేఆర్ శ్రీనివాసరెడ్డి, సైకం రమణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు టి.హసీనా, బేతా ప్రకాశ్ రెడ్డి, ముక్కాల శేఖరరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పొదిలి మండల కార్యకర్తలు

క్లుప్తంగా

25న ఆలయ భూముల కౌలు వేలం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయ భూముల కౌలు వేలం ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఈఓ మల్లవరపు నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు చోళ్లవీడు గ్రామంలోని సర్వే నంబర్ 351లో గల 3.89 ఎకరాల భూమికి రామాలయంలో, అనుములవీడు సర్వే నంబర్ 282లో గల 5.16 ఎకరాల భూమికి ఉదయం 11 గంటలకు రామాలయంలో, రామాపురంలో సర్వే నంబర్ 1142లో గల 5.08 ఎకరాలు, 1213 సర్వే నంబర్‌లో గల 2.29 ఎకరాలు, సర్వే నంబర్ 51లో గల 3.43 ఎకరాల భూమికి మధ్యాహ్నం 12 గంటలకు రామాలయంలో, అర్థవీడు మండలం రంగాపురం గ్రామంలోని 162 సర్వే నంబర్‌లో గల 7.17 ఎకరాల భూమికి సాయంత్రం 3 గంటలకు రామాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు వేలంలో పాల్గొనాలని సూచించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎస్సీ కేటగిరీలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరీ ఐదో తరగతిలో 34 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో 18 సీట్లు ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 23వ తేదీ లోగా ఆధార్ కార్డుతో వెలుగొండ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం టౌన్: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.సోమయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించి, కేరళ వాసులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీపీఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరనిలోటన్నారు. అక్షరాస్యతలో కేరళను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర మరువలేమన్నారు. కార్మిక సమస్యలపై అనేక ఉద్యమాలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, మండల కార్యదర్శి జి.బాలనాగయ్య, రాజు, అడివయ్య, ఏనుగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్, డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం


కంభంలో విద్యార్థినులకు సూచనస్తున్న కంభం సీఐ

కంభం: విద్యార్థినులతో ఎవరైనా తప్పుగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్ కు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కంభం సీఐ కె.మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ చేసి వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పకూడదని తెలిపారు. గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చెడువ్యసనాలకు బానిసలుగా మారకుండా చదువుకొని ప్రయోజకులుగా మారాలన్నారు. ఎస్సై నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిల్లులు చేయరు.. సమస్యలు పరిష్కరించరు

- వాడీవేడిగా బేస్తవారిపేట మండల సర్వసభ్య సమావేశం
- గృహ లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇసుకను అమ్ముకుంటున్నారని సభ్యుల ఆరోపణ
- పాత విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చడం లేదని ఆగ్రహం
- రెవెన్యూ, విద్యా సమస్యలు, భూఆక్రమణలు, దొంగ మస్టర్లపై ప్రశ్నల వరంపర

బేస్తవారిపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జేసీ అగ్రహారంలో గ్రామ సచివాలయం నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఏడాది కాలంగా రూ.4.80 లక్షల చెక్కు ఇవ్వకుండా ఎందుకు నిలిపారని ఈఓపీఆర్డీ జిలానీ బాషా, పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. దీనిపై ఈఓపీఆర్డీ స్పందిస్తూ వారం రోజుల్లో కాంట్రాక్టర్‌కు చెక్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామ మహిళా సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేసుకోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖాజీపురంలో రాత్రి వేళల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, ఏడాది కాలంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వృథాగా ఉందని సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. చెన్నుపల్లెలో విద్యుత్ స్తంభాలు పడిపోయేలా ఉండటంతో కనీసం వీధి దీపాలు వేయడానికి భయపడుతున్నారని, బేస్తవారిపేటలో 75 ఏళ్ల క్రితం విద్యుత్ స్తంభాలు, లైన్ ఎందుకు మార్చడంలేదని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. పెద్ద ఓబినేనిపల్లెలో ఓ మహిళ తన భర్త చనిపోగా పొలం మ్యుటేషన్ కోసం నాలుగు సార్లు దరఖాస్తు చేయగా ఆన్‌లైన్‌లో కనపడటం లేదని రెవెన్యూ సిబ్బంది చెప్పడంపై ఎంపీటీసీ సభ్యుడు అసహనం వ్యక్తం చేశారు. గృహ లబ్ధిదారులకు అందించాల్సిన ఇసుకను హౌసింగ్ సిబ్బంది ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారని, అడిగితే ఇంకా రాలేదని చెబుతున్నారని సభ్యులు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. బేస్తవారిపేటలోని సత్రం స్కూల్లో వంట గది శిథిలావస్థకు చేరిందని, జెడ్పీ బాలుర హైస్కూల్ కాంపౌండ్ వాల్‌ను రోడ్డు విస్తరణలో తొలగించడంతో పందులు, పశువులు పాఠశాలలోకి వెళ్తున్నాయని ఎంపీటీసీ సభ్యుడు తెలిపారు. పశువుల దాణా మండలానికి వచ్చిన విషయం కనీసం ప్రజాప్రతినిధులకు తెలియకుండానే పంపిణీ చేయడం పద్ధతి కాదన్నారు. ఎంపీ చెరువులో కప్పలకుంట ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఎంపీటీసీ ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి

పెంచికలపాడు కొత్త చెరువు మట్టిని అక్రమంగా ఇటుకల బట్టీలకు తరలిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సర్పంచ్ నిలదీశారు. గ్రామంలో లేనివారికి జాబ్‌కార్డులు ఎలా ఇస్తున్నారని, పలు గ్రామాల్లో దొంగ మస్టర్లు వేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని, కొందరి జాబ్‌కార్డులు ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు ఏపీఓపై ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీ4 కార్యక్రమంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పేద కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రాజయ్య, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు



కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబును సన్మానిస్తున్న రాష్ట్ర కార్యదర్శులు

కంభం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన కంభం మండల తురిమెళ్లకు చెందిన యేలం వెంకటేశ్వరరావు, పొదిలికి చెందిన కేవీ రమణారెడ్డి సోమవారం రాత్రి గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ పదవులు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ గఫార్‌అలి ఖాన్ ఉన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

- అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర పోలింగ్ బూత్ కార్యదర్శి రవిచంద్ర

మార్కాపురం: ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర పోలింగ్ బూత్ కార్యదర్శి పత్తి రవిచంద్ర కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ.. 1200 మంది ఓటర్లు మించకుండా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 257 పోలింగ్ బూత్‌లు ఉండగా, నూతనంగా 21 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నుంచి తాళ్లపల్లి సత్యనారాయణ, పీవీ కృష్ణారావు, నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న కంభం సీఐ కె.మల్లికార్జున


మార్కాపురంలో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ నాగరాజు

- వాహనదారులకు డీఎస్పీ నాగరాజు హెచ్చరిక

మార్కాపురం టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ యు.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మార్కాపురం శివారు ప్రాంతాలతోపాటు పట్టణంలోని పలు ప్రదేశాల్లో సీఐ సుబ్బారావుతో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బైక్‌లకు అమర్చిన సైలెన్సర్లను తొలగింపజేశారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేశారు. పలువురు వాహనదారులతో పెండింగ్ చలానాలు కట్టించారు. మొత్తం 106 కేసులు నమోదు చేసి 22,440 రూపాయల జరిమానా విధించామని, రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేశామని సీఐ తెలిపారు. పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు, ట్రాఫిక్ ఎస్సై అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

కంభం: లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర ధృవపత్రాలు లేకుండా, మద్యం సేవించి ఆటోలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని కంభం సీఐ కె.మల్లిఖార్జున, ఎంవీఐ మాధవరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం కచ్చితంగా ధరించాలని, ధ్రువీకరణ పత్రాలు దగ్గర పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా చర్యలు తప్పవన్నారు. సహాయ కార్మిక శాఖాధికారి బాలకాశి మాట్లాడుతూ.. ఈశ్రమ్ కార్డు ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు ఎస్సైలు నరసింహారావు, రవీంద్రారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

గిద్దలూరు రూరల్: కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికులు పంగనామాలు పెట్టుకుని పట్టణంలోని పలు వీధుల్లో తిరిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు. జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, రిటైరైన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు మురళి, చంటెయ్య, బాలయ్య, రంగయ్య, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో పంగనామాలు పెట్టుకుని సమ్మె చేస్తున్న కార్మికులు

వేతన బకాయిలు చెల్లించాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు శానిటరీ వర్కర్ల వినతి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మార్కాపురం: గవర్నమెంట్ హాస్పిటల్ శానిటరీ వర్కర్లకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ఆధ్వర్యంలో కార్మికులు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల వేతనంలో కట్ చేసిన పీఎఫ్ నగదును వెంటనే జమ చేయాలని కోరారు. తక్కువ వేతనం ఇస్తూ, దానిని కూడా నాలుగు నెలలుగా నిలిపేస్తే ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. జీతం చెల్లించకుండా పనిచేయించుకుంటున్న విజయవాడకు చెందిన ఫస్ట్ ఆబ్జెక్టివ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెలాఖరులోగా జీతం ఇవ్వకుంటే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూబెన్, అంది సురేష్, స్వప్న, బాలకృష్ణ, కొండమ్మ, మల్లికార్జున, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెంచాలి

తర్లుపాడు: రానున్న విద్యా సంవత్సరంలో కలుజువ్వలపాడులోని పీఎంశ్రీ జవహర్ నవోదయలో 6వ తరగతిలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ఎంఈఓలు కృషి చేయాలని డీవైఈఓ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కలుజువ్వలపాడులోని నవోదయలో 27 మండలాల ఎంఈఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఎక్కువ మంది నవోదయలో రిజిస్ట్రేషన్ చేయించుకుని సీట్లు పొందేందుకు కృషి చేయాలని కోరారు. ఈనెల 29తో అప్లికేషన్ల ప్రక్రియ ముగుస్తున్నందున స్థానిక హెచ్ఎంలతో మాట్లాడి రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. అప్లికేషన్ నమోదులో సమస్యలపై నవోదయ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఎంఈఓలకు అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్ నంబర్లు, జవహర్ నవోదయ పోస్టర్లు, అప్లికేషన్లను ఎంఈఓలకు అందచేశారు. నవోదయ ఇన్‌చార్జి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.


డీవైఈఓకు స్వాగతం పలుకుతున్న నవోదయ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి

గాయత్రి మాతకు ప్రత్యేక పూజలు


సామూహిక కుంకుమార్చనలో ఆర్యవైశ్య మహిళలు

గిద్దలూరు రూరల్: ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంటలో గల గాయత్రిమాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సామూహిక కుంకుమార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

వాహనాల తనిఖీ

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం, దర్శితో పాటు పలు ప్రాంతాల్లో దర్శి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పర్మిట్స్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు రూ.1.06 లక్షల అపరాధ రుసుం విధించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com